
సాక్షి ఒడిశా

బుధవారం । 10 । సెప్టెంబర్ । 2025



శ్రీ మందిరం ఆదాయం లెక్కింపు
నగదు: రూ. 3,07,374
వెండి: 5 గ్రాముల 650 మిల్లీ గ్రాములు
- భువనేశ్వర్/పూరీ



టీటీఈలకు బయోమెట్రిక్

టీటీఈలకు బయోమెట్రిక్ వ్యవస్థ రానుంది. ఏర్పాట్లు జరుగుతున్నాయి.

- 8లో



గంజాయి స్వాధీనం

గజపతి జిల్లాలో అబ్కారీ శాఖ దాడులు చేసింది. పలువురిని పట్టుకున్నారు.

- 8లో

న్యూస్‌రీల్

శ్రీ జగన్నాథుని సర్వ దర్శనానికి అంతరాయం

భువనేశ్వర్: పూరీ శ్రీ మందిరంలో మంగళ వారం రత్న వేదికపై చతుర్ధా మూర్తుల సర్వ దర్శనానికి స్వల్ప అంతరాయం ఏర్పడింది. మందిరం లోపలి ప్రాంగణంలో ఉమ్మి వేసి నట్లు దృష్టికి రావడంతో ఆకస్మికంగా మూల విరాట్లకు శుద్ధి స్నానం చేయించాల్సి వచ్చింది. ఇదో గోప్యమైన ఆచారం కావడంతో ఈ ప్రక్రియ ముగిసేంత వరకు భక్తులకు సర్వ దర్శనం తాత్కాలికంగా నిలిపి వేశారు. దాదాపు గంటన్నర పాటు సర్వ దర్శనం స్తం భించి పోయింది. ఆలయ పవిత్రతకు భంగం వాటిల్లినప్పుడు నిర్వహించే ముఖ్యమైన శుద్ధీక రణ కర్మ మహా స్నానంగా పేర్కొంటారు. ఈ ఆచారం సమయంలో, ఆధ్యాత్మిక స్వచ్ఛతను పునరుద్ధరించడానికి రత్న వేదికపై కొలువు దీరిన జగన్నాథుడు, బలభద్రుడు, దేవీ సుభద్ర విగ్రహాలను ఆచారబద్ధంగా శుద్ధి చేస్తారు.

మొబైల్ దుకాణంలో చోరీ



చోరీకి సంబంధించి వివరాలు సేకరిస్తున్న పోలీసులు

రాయగడ: జిల్లాలోని బిసంకటక్‌లో నేతాజీ క్లబ్ సమీపంలోఉన్న ఒక మొబైల్ దుకాణంలో సోమవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. గుర్తు తెలియని దుండగులు దుకాణం తాళాలు విర గ్గొట్టి లోపలకు చొరబడి విలువైన వివిధ బ్రాం డ్‌ల మొబైళ్లను దొంగిలించారు. అయితే తమను గుర్తు పట్టకుండా ఉండేందుకు దుండ గులు దుకాణంలోని సీసీ కెమెరాలను విరగ్గొ ట్టడంతో పాటు హార్డ్ డిస్క్‌ను తమ వెంట తీసుకువెళ్లిపోయారు. సమాచారం తెలుసు కున్న పోలీసులు ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. దుకాణం యజమాని అరుణ్ పాత్రో మంగళవారం ఉదయం మొబైల్ దుకాణాన్ని తెరిచేందుకు వెళ్లగా తలు పులు విరిగి పడి ఉండటం గమనించి వెంటనే పోలీసులకు సమాచారం అందించాడు. లోనికి వెళ్లి చూడగా నాలుగు లక్షల రూపాయలు విలువ చేసే 22 మొబైళ్లు చోరీకి గురైనట్టు పోలీస్‌స్టేషన్‌లో బాధితుడు ఫిర్యాదు చేశారు.

తిరుపతిలో వలస కార్మికుడు మృతి



ఉమాశంకర్ (ఫైల్)

రాయగడ: తిరుపతిలో వలస కార్మికుడు మృతి చెందిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. మృతుడు జిల్లాలోని కాసీపూర్ సమితి పరిధి బంకాంబ పంచాయతీలోని మంకొడొజొల గ్రామానికి చెందిన ఉమాశంకర్ మాఝి (21)గా గుర్తిం చారు. కొద్ది నెలల క్రితం నుంచి స్నేహితులతో కలసి ఉమాశంకర్ తిరుపతిలోని ఒక పైపుల కంపెనీలో పనిచేస్తుండేవాడు. ఈ నెల ఆరో తేదీన అస్వస్థతకు గురైన అతడు ఆదివారం మృతి చెందినట్లు కంపెనీ వర్గాలు అతని కుటుంబానికి సమాచారం అందించారు. దీం తో సమాచారం తెలుసుకున్న కుటుంబీకులు సోమవారం తిరుపతి వెళ్లారు. మృతదేహాన్ని ఇక్కడకు తీసుకువచ్చి అంతిమ సంస్కారాలు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

మహిళ ఆత్మహత్య



సవిత మృతదేహం

మల్కన్‌గిరి: మహిళ అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. ఈ సంఘటన మల్కన్‌గిరి జిల్లా కోరుకొండ సమితి చితాపారి గ్రామంలో సోమవారం రాత్రి చోటుచేసుకోగా.. సవిత (30) ప్రాణాలు కోల్పోయింది. గ్రామానికి చెందిన పూర్ణచంద్ర ముదిలీ కుమార్తె సవిత రోజూ ఉదయాన్నే లేచి తండ్రికి టీ చేసి ఇవ్వడం అలవాటు. మంగళవారం ఉదయం ఇవ్వకపోవడంతో తండ్రి వెళ్లి గది లోకి చూడగా సవతి ఫ్యాన్‌కు వేలాడుతూ చని పోయి కనిపించింది. దీంతో బలిమెల పోలీసు లకు సమాచారం ఇచ్చారు. ఐఐసీ దీరాజ్ పటా న్నయక్ సంఘటనా స్థలానికి వెళ్లి విచారించారు. సవితకు కొన్ని సంవత్సరాల క్రితం వీరకిశో రపూర్ గ్రామానికి చెందిన పవిత్రో ఖీలోతో వివాహం జరిగింది. అయితే కొద్ది నెలల తరు వాత భర్తతో తగాదా రావడంతో అతన్ని విడి చిపెట్టేసి తండ్రి పూర్ణచంద్ర ముదిలి వద్దకు వచ్చేసి ఉంటుంది. ఆ తరువాత చితాపారికు చెందిన ఖగపతి కిర్సనీ వివాహం చేసుకుంది. దంపతులిద్దరూ తండ్రి వద్దే ఉంటున్నారు. ఈ పరిస్థితిలో సవిత ఆత్మహత్యకు పాల్పడం అనుమానాలకు తావిస్తుంది. అందిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి మృతదే హాన్ని పోస్టుమార్టం నిమిత్తం మల్కన్‌గిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు వెల్లడించారు.

విన్నపాలు వింటూ..

- ప్రజలతో మమేకమవుతూ గవర్నర్ పర్యటన



గవర్నర్ హరిబాబుకు కొడింగమాలి గనుల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే పవిత్ర శాంత



కేంద్రీయ విశ్వ విద్యాలయంలో సమీక్ష సమావేశంలో గవర్నర్ హరిబాబు

కొరాపుట్: గవర్నర్ కంభంపాటి హరిబాబు ప్రజలతో మమేకమవుతూ తన పర్యటన సాగిస్తున్నారు. నిబంధనలు పక్కన పెట్టి మంగళవారం రెండో రోజు కొరాపుట్‌లో ఆయన పర్యటన సాగింది. విపక్ష పార్టీల నేతలతో కూడా ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గత గవర్నర్ల కంటే విభిన్నంగా ఈ పర్యటన సాగడం విశేషం. ఉదయం ఆయన ఒడిశా కేంద్రీయ విశ్వ విద్యాలయాన్ని సందర్శించారు. విశ్వ విద్యాలయంలో వివిధ విభాగాల పనితీరును పరిశీలించారు. చాన్స్‌లర్ హోదాలో ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సహాయ సహకారాల అమలు తీరుపై నివేదికలు పరిశీలించారు. ఇదే వేదిక వద్ద అఖిల పక్ష పార్టీల నాయకులు గవర్నర్ వద్దకు చేరుకున్నారు. వారందరినీ దగ్గరకు పిలిపించుకొని సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ బృందంలో ఉన్న కాంగ్రెస్ పార్టీకి చెందిన లక్ష్మీపూర్ ఎమ్మెల్యే పవిత్ర శాంత లేఖని గవర్నర్‌కు అందజేశారు.

లక్ష్మీపూర్ సమితిలో కొడింగా మాలి వద్ద గనుల తవ్వకాలు, తాము చేస్తున్న పోరాటం వివరించారు. అక్కడ గిరిజనులకు ఫెరి ఫెరి డెవలప్‌మెంట్ నిధులు ద్వారా సంక్షేమ పథకాలు అందడం లేద న్నారు. మొదట పేర్కొన్న విధంగా కాకుడా గనుల రెట్టింపు తవ్వకానికి ప్రయత్నాలు జరుగుతున్నా యన్నారు. సమస్యను గవర్నర్ కూలంకషంగా తెలుసుకున్నారు. ఈ బృందంలో బీజేడీకి చెందిన జిల్లా అధ్యక్షుడు జిన్ను హిక్కా తదితరులు ఉన్నారు. అనంతరం రాజ్‌పుట్‌లో గిరిజన మహిళలు నిర్వహిస్తున్న మిలెట్ మిషన్‌ని సందర్శిం చారు. మిలెట్స్ ప్రాసెసింగ్ యూనిట్‌ను ప్రభుత్వ సహకారంతో మహిళలు అభివృద్ధి పథంలోకి తీసుకువచ్చారని కొరాపుట్ కలెక్టర్ సత్యవాన్ మహాజన్ వివరించారు. అక్కడ గిరిజన మహిళలను పిలిపించుకొని వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మెక్కలు నాటి వన యజ్ఞం ప్రారంభించారు. కార్య క్రమంలో కాంగ్రెస్ శాసన సభా పక్ష నాయకుడు రాం చంద్ర ఖడం, బీజేపీ ఎమ్మెల్యేలు రూపుధర్ బోత్ర, రఘురాం మచ్చో, ఎస్పీ రోహిత్ వర్మలు పాల్గొన్నారు.



వన యజ్ఞం చేస్తున్న గవర్నర్ హరిబాబు



రాజ్‌పుట్‌లో గిరిజన మహిళల సమస్యలు అడిగి తెలుసు కుంటున్న గవర్నర్ హరిబాబు



రాజ్‌పుట్ మిలెట్స్ మిషన్ పని తీరుని గవర్నర్‌కి వివరిస్తున్న కలెక్టర్ మహాజన్



స్థానిక గిరిజన మహిళలతో గవర్నర్, కలెక్టర్, ఎమ్మెల్యేలు

మాజీ ముఖ్యమంత్రి సదాశివ త్రిపాఠికి ఘనంగా నివాళి



నబరంగ్‌పూర్‌లో సదాశివ త్రిపాఠి విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే గౌరీ మఝి, కలెక్టర్ మహేశ్వర్ స్వయ్ తదితరులు

కొరాపుట్: నబరంగ్‌పూర్ జిల్లాకు చెందిన దివంగత మాజీ ముఖ్యమంత్రి సదాశివ త్రిపాఠి 46వ వర్ధంతి మంగళవారం నిర్వహించారు. నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలో మెయిన్ రోడ్డులో సదాశివ త్రిపాఠి పార్క్‌లో సదాశివ విగ్రహానికి పలువురు పూలమా లలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్మృతి సభ నిర్వహించారు. సమావేశంలో నబరంగ్‌పూర్ ఎమ్మెల్యే గౌరీ శంకర్ మఝి ప్రసంగిస్తూ రాష్ట్రంలో భూ సంస్కరణలు సదాశివ త్రిపాఠి కఠినంగా అమలు చేశారని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి కాక ముందు రెవెన్యూ మంత్రిగా పని చేసినప్పుడు తనకు చెందిన 700 ఎకరాలు భూమిని ప్రభుత్వ పరంచేసిన ఘనత సదాశివకి చెందుతుందన్నారు. అంతకు ముందు సదాశివ సమాధి వద్ద కుటుంబ సభ్యులు నివాళులర్పించారు. కార్యక్రమాల్లో కలెక్టర్ మహేశ్వర్ స్వయ్, చైర్మన్ కును నాయక్, ఏపీపీ సంతోష్ మిశ్ర, కేదార్ త్రిపాఠి తదితరులు పాల్గొన్నారు.



సదాశివ సమాధి వద్ద నివాళులు అర్పిస్తున్న అతని వంశీయులు

విద్యుత్ పొరుగు సేవల ఉద్యోగుల నిరసన



కలెక్టరేట్ గేటు వద్ద ఆందోళన చేస్తున్న అఖిల భారత విద్యుత్ ఉద్యోగుల మహాసంఘం సభ్యులు

పర్లాకిమిడి: విద్యుత్ ఉద్యోగుల నాలుగు న్యాయ మైన డిమాండ్లు నెరవేర్చాలని అఖిల భారత ఒడిషా విద్యుత్ మజ్దూర్ మహాసంఘ్ పేరిట మంగళవారం కలెక్టరేట్ వద్ద ఆందోళన జరి పారు. తొలుత మెడికల్ జంక్షన్ నుంచి ర్యాలీగా బయల్దేరిన విద్యుత్ ఉద్యోగుల మహాసంఘం కలెక్టరేట్‌కు చేరుకుని నినాదాలు చేశారు. టాటా పవర్ డిస్ట్రిబ్యూషన్ ప్రైవేట్ లిమిటెడ్‌లో పనిచే స్తున్న లైన్‌మెన్లు, హెల్పర్లు, కార్యాలయంలో పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు గ్రేడ్‌పే పెంచాలని, ఎన్‌పీఎస్, యూపీఎకు బదులు పాత పింఛను విధానం అమ లుచేయాలని, హరియాణా రాష్ట్ర అవుట్ సోర్సింగ్ మోడల్ అమలు, ఇంటర్ జోన్ బదిలీలు, ఒడిశాలో కేంద్ర పీఆర్‌సీ 2019 అమలు వంటి పలు డిమాండ్లతో ఆందోళన జరిపారు. అనంతరం ముఖ్యమంత్రి మోహన్ మఝి, ఉపముఖ్యమంత్రి కనకవర్ధన్ సింగ్, రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి పేరిట అడ్రస్ చేసిన వినతి పత్రాన్ని అదనపు మేజిస్ట్రేట్ ఫాల్గుణీ మఝికి తన కార్యాలయంలో భారతీయ మజ్దూర్ సంఘ్ జిల్లా అధ్యక్షులు సుజిత్ ప్రధాన్, విద్యుత్ మజ్దూర్ మహాసంఘ్ కార్యదర్శి సత్యవ్రత పరిడాలు కలిసి అందజేశారు. ఆందోళనలో కోశాధికారి మున్నాదామి, జిల్లాలోని పలు సబ్ డివిజన్‌లలో పనిచేస్తున్న విద్యుత్ లైన్‌మెన్లు, పొరుగుసేవల ఉద్యోగులు పాల్గొన్నారు.



కలెక్టరేట్‌కు ర్యాలీగా వెళుతున్న అఖిల భారత విద్యుత్ ఉద్యోగుల మహాసంఘం

మంచినీటి ప్రాజెక్టు పనుల్లో జాప్యం

- అధికారులపై కలెక్టర్ ఆగ్రహం



సమీక్షా సమావేశంలో కలెక్టర్ కులకర్ణి, జెడ్పీ సీఈఓ అక్షయ ఖెమెండో



సమావేశంలో పాల్గొన్న అధికారులు

రాయగడ: గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలకు మంచినీటి సౌకర్యార్థం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలకు సంబంధించిన పనుల్లో జాప్యమెందుకు చోటు చేసుకుంటుందని జిల్లా కలెక్టర్ అశుతోష్ కులకర్ణి ప్రశ్నించారు. ఈ మేరకు సంబంధిత అధికారులపై ఆయన మండిపడ్డారు. అధికారులు కాగితాల మీదే ప్రాజెక్టులకు సంబంధించిన పనులను లెక్కలు చూపించడం కాదని, వాస్తవ పరిస్థితులను తెలియజేయాల్సిన బాధ్యత ఉన్నప్పటికీ దానిని విస్మరిస్తున్నారని అన్నారు. స్థానిక డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో మంగళవారం గ్రామీణ నీటి సరఫరా అధికారులతో ఆయన సమీక్షించి అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరాలు తెలుసుకున్నారు. పనుల్లో నాణ్యత లోపిస్తున్నట్టు విమర్శలు వస్తున్న నేపథ్యంలో పనులు బాగా చేపట్టాలన్నారు. గత కొద్ది రోజుల క్రితం జిల్లాలోని బిసంకటక్ కోర్టు సమీపంలో మేగా తాగునీటి ప్రాజెక్టుకు సంబంధించిన పైపు లైన్ పగిలి నీరు వృథా అవ్వడంపై కలెక్టర్ తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఇకమీదట పనుల్లో నాణ్యత కనిపించకపోతే చర్యలు చేపట్టడం ఖాయమని అన్నారు. అదేవిధంగా కొనసాగుతున్న పనులు త్వరితగతిన పూర్తయ్యేలా కృషి చేయాలని అన్నారు. సమావేశంలో జిల్లా పరిషత్ ముఖ్య కార్య నిర్వాహక అధికారి అక్షయ కుమార్ ఖెముండో తదితరులు పాల్గొన్నారు.

ప్రొఫెసర్ ప్రభాత్ కుమార్ రౌల్ పదవీ కాలం పొడిగింపు




భువనేశ్వర్ : ఒడిశా వ్యవసాయ, సాంకేతిక విశ్వవిద్యాలయం (ఓయూఏటీ) వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ ప్రభాత్ కుమార్ రౌల్ ఉద్యోగ పదవీ కాలం మూడేళ్లు పొడిగించారు. ఈ పొడిగింపు తక్షణమే పరిగణనలోకి తీసుకుంటారు. ఈ నెల 9 నుంచి తదుపరి ఉత్తర్వులు జారీ అయ్యేంత వరకు మూడేళ్ల వరకు నిరవధికంగా కొనసాగుతాయి. ఈ మేరకు రాష్ట్ర గవర్నర్ ఆమోదం లభించింది. ప్రొఫెసర్ ప్రభాత్ కుమార్ రౌల్ ఒడిశా వ్యవసాయ, సాంకేతిక విశ్వవిద్యాలయం పూర్వ విద్యార్థి. ఆయన ఇంతకు ముందు ఒడిశా వ్యవసాయ అభివృద్ధి, పెట్టుబడుల సంస్థ (ఏపీఐసీ ఓఎల్) మేనేజింగ్ డైరెక్టర్‌గా పని చేశారు. విద్యా రంగంలో పటిష్టమైన పాలన దక్షత కలిగి ఉన్నారు. లోగడ ఓయూఏటీలో డీన్ (ఎక్స్‌టెన్షన్), డీన్ (వెటర్నరీ) మరియు డైరెక్టర్ ఆఫ్ ప్లానింగ్, మానిటరింగ్, మూల్యాంకనం వంటి వివిధ కీలక పదవుల్లో బాధ్యతలను దక్షతతో నిర్వహించారు. బోధన, పరిశోధన, అధికారిక పాలన రంగంలో విస్తృత అనుభవంతో, ప్రొఫెసర్ ప్రభాత్ కుమార్ రౌల్ వైస్ చాన్స్‌లర్‌గా చక్కటి పనితీరు ప్రదర్శించారు.

కాటేసిన అంధ విశ్వాసం

- పాముకాటు వైద్యం అందక అక్కా తమ్ముడు మృతి



ఉమ్మర్ కోట్ ఆస్పత్రిలో అక్కాతమ్ముడి మృతదేహాలు



కాటేసిన తాచుపాము



ఆస్పత్రి ముందు బాధిత కుటుంబ సభ్యులు



అమిత హరిజన్



పూజరాజ్ హరిజన్

కొరాపుట్: బరంగ్‌పూర్ జిల్లా ఉమ్మర్ కోట్ సమితి రాజ్‌పూర్ గ్రామంలో మంగళవారం వేకువజామున ఇంటిలో నిద్రపోతున్న అమిత హరిజన్ (11), ఆమె తమ్ముడు పూజరాజ్ హరిజన్ (9 నెలలు)ను పాము కాటేసింది. దీంతో ఇద్దరు పిల్లలు ఏడవడంతో మేలుకున్న కుటుంబ సభ్యులు పామును గుర్తించి చంపేశారు. కానీ పిల్లలను ఆస్పత్రికి తీసుకెళ్లకుండా మంత్రగత్తె వద్ద పూజలు చేయించారు. కానీ అప్పటికే బాలలు ఇద్దరూ అపస్మారక స్థితిలోకి చేరుకున్నారు. ఇది గమనించిన గ్రామ యువకులు వెంటనే అంబులెన్స్‌ను రప్పించి బాలలను ఉమ్మర్ కోట్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కానీ అప్పటికే వారు చనిపోయినట్లు వైద్యులు ధ్రువీకరించారు. పాము కాటు జరిగిన వెంటనే ఆస్పత్రికి తెచ్చి ఉంటే బాలలిద్దరూ బతికేవారని వైద్యులు పేర్కొన్నారు.

బీజేడీకి నెక్కంటి గుడ్‌బై

- బిజూ స్వాభిమాన్ మంచ్ పేరిట కార్యకలాపాలు



బీజేడీ పార్టీ సభ్యత్వానికి అందరి సమక్షంలో రాజీనామా చేస్తున్న నెక్కంటి



బిజూ స్వాభిమాన్ మంచ్ లోగోను ఆవిష్కరించిన నెక్కంటి, పక్కనే ఆయన అభిమానులు



కంటితడి పెట్టుకుంటున్న నెక్కంటి



సమావేశంలో పాల్గొన్న నెక్కంటి అభిమానులు

రాయగడ: రాజ్యసభ మాజీ ఎంపీ, బీజేడీ సీనియర్ నాయకుడు నెక్కంటి భాస్కరరావు ఆ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. బిజూ స్వాభిమాన్ మంచ్ పేరిట ఇకపై తన సేవా కార్యక్రమాలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. స్థానిక తేజస్వి హోటల్ సమీపంలోని మైదానంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. బిజూ పట్నాయక్ 1974లో తనను స్వయంగా పార్టీలోకి ఆహ్వానించారని, అనంతరం ఆయన తనయుడు నవీన్ పట్నాయక్‌తోనూ పనిచేశానని తెలిపారు. 50 ఏళ్ల సుదీర్ఘ రాజకీయ జీవితంలో ఎన్నో ఒడిదొడుకులు ఎదుర్కొన్నానని తెలిపారు. ఇటీవల కాలంలో అధిష్టానం తనను విస్మరించడం జీర్ణించుకోలేకపోతున్నానని, అందుకే పార్టీతో తెగదెంపులు చేసుకుంటున్నానని వివరించారు. జిల్లాలో ఎందరో తనను ఆదరిస్తున్నారని, వారి వెనుక నిలబడేందుకే బిజూ స్వాభిమాన్ మంచ్ పేరిట సామాజిక వేదికను ఏర్పాటు చేయాల్సి వచ్చిందని అన్నారు. ఇది కేవలం సేవకు మాత్రమేనని, రాజకీయాలకు కాదని స్పష్టం చేశారు.

పెద్దల సలహాతో..

కొద్ది రోజులుగా రాష్ట్రంలో బీజేడీలో అనూహ్య మార్పులు జరుగుతున్నాయి. పార్టీ జిల్లా అధ్యక్షుడి హోదాను మరొకరికి ఇవ్వడం నెక్కంటికి నచ్చలేదు. దీంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. పార్టీ శ్రేణులు, తన మద్దతుదారుల్లో అసంతృప్తి పెరగడం కూడా ఈ వేదిక ఏర్పాటుకు మరో కారణమని అన్నారు. రాష్ట్ర స్థాయి పెద్దలతో, తన సహచరుల సలహాతో రాజీనామా నిర్ణయం తీసుకున్నానని తెలిపారు. కొత్తగా ఏర్పాటైన బిజూ స్వాభిమాన్ మంచ్ వేదికకు అందరి సహకారం అవసరమని తెలిపారు. అనంతరం మంచ్ లోగోను ఆవిష్కరించారు.

ప్రాణం ఉన్నంత వరకు ప్రజాసేవలోనే..

జిల్లాలో ఎందరో తనను ఆదరించారని నెక్కంటి తెలిపారు. పార్టీలో అనేక హోదాల్లో కొనసాగిన తాను జిల్లా అభివృద్ధికి అందరి సహకారంతో పనిచేశానని పేర్కొన్నారు. తనను పార్టీ అవమానించడం జీర్ణించుకోలేకపోతున్నానని ఆయన కన్నీటి పర్యంతమయ్యారు. తన రక్తాన్ని పంచుకుపుట్టిన ఇద్దరు అన్నదమ్ములను ఒక సందర్భంలో కోల్పోయినప్పటికీ బీజేడీ ఆశయ సాధన కోసం, జిల్లా అభివృద్ధి కోసం పనిచేసినట్లు గుర్తు చేశారు.

ఎవరినీ నిందించడం లేదు

తాను ఏర్పాటు చేసిన బిజూ స్వాభిమాన్ మంచ్ కేవలం ప్రజా సంక్షేమం కోసమేనని నొక్కి చెప్పారు. అయితే అందుకు ఎవ్వరిని నిందించడం లేదని స్పష్టం చేశారు. త్వరలో మంచ్ భవిష్యత్ ప్రణాళికలను రూపొందించి రాష్ట్ర వ్యాప్తంగా విస్తరించమే తన ప్రథమ కర్తవ్యమని అన్నారు. బీజేడీకి నెక్కంటి మద్దతు దారులు, అనుయాయులు, కార్యకర్తలు సామాహికంగా రాజీనామాలు చేశారు. అందరి సమక్షంలో ఈ రాజీనామా పత్రాలపై సంతకాలు చేశారు. మాజీ మంత్రి లాల్ బిహారి హిమిరిక, జిల్లా పరిషత్ మాజీ అధ్యక్షులు గంగాధర్ పువ్వల, బీజేడీ యువ నాయకులు బినాయక్ కర్, అమయ స్వాయి, అవినాష్ బిశొయి, తదితర పార్టీ ప్రముఖులు బీజేడీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామాలు చేశారు.

క్లుప్తంగా

సమన్వయంతో పనిచేస్తేనే సత్ఫలితాలు



మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి హరిబాబు

శ్రీకాకుళం పాతబస్టాండ్: సమాజంలో అట్టడుగు వర్గాలకు సత్వర న్యాయం అందించాలంటే ప్రభుత్వ శాఖలు, స్వచ్ఛంద సంస్థల మధ్య సమన్వయం అవసరమని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ (డీఎల్ఎస్ఏ) కార్యదర్శి కె.హరిబాబు అన్నారు. స్వచ్ఛంద సంస్థలు, సంబంధిత విభాగాల అధికారులతో కలిసి మంగళవారం జిల్లా న్యాయ సేవా సదన్‌లో సదస్సు నిర్వహించారు. మహిళలు, పిల్లలు, వృద్ధులు, అక్రమ రవాణా బాధితులు, ట్రాన్స్‌జెండర్లు, గిరిజనులు, అసంఘటిత కార్మికులు వంటి వివిధ వర్గాల ప్రయోజనాలపై చర్చించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విభాగాల అధికారులు తాము అందిస్తున్న పథకాలను వివరించగా, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు సమాజానికి తాము చేస్తున్న సేవలను తెలియజేశారు. కార్యక్రమంలో డీసీపీవో రమణ, ఎల్ఏడీసీ ప్రధాన అధికారి కె.ఆఫీసు పాల్గొన్నారు.

వెబ్ కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదల

ఎచ్చెర్ల : ఏపీ ఈఏపీ సెట్-2025 ప్రవేశ పరీక్షలకు అర్హత సాధించిన బైపీసీ స్ట్రీమ్ విద్యార్థులకు బీ-ఫార్మసీ, ఫార్మాడీ, బీ టెక్ బయోటెక్నాలజీ, ఫుడ్ టెక్నాలజీ, ఫుడ్ ఇంజినీరింగ్, అగ్రికల్చర్/ఫార్మాస్యూటికల్ ఇంజినీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించి సాంకేతిక విద్యాశాఖ ఉన్నత విద్యామండలి వెబ్ కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదల చేసిందని శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్, సహాయ కేంద్రం సమన్వయకర్త కె.నారాణరావు మంగళవారం తెలిపారు. రిజిస్ట్రేషన్ల ప్రోసెసింగ్ కోసం ఈ నెల 11 నుంచి 16 వరకూ రుసుము చెల్లించాలని చెప్పారు. ఈ నెల 12 నుంచి 17లోగా ధ్రువపత్రాలు అప్‌లోడ్ చేసి ఆన్‌లైన్ పరిశీలన, 13 నుంచి 18 వరకూ కళాశాలల కోర్సుల ఎంపికకు వెబ్ ఆప్షన్లు, 19న వెబ్ ఆప్షన్ల మార్పు, 21న కళాశాలలు, కోర్సుల కేటాయింపు జాబితా వెల్లడించనున్నట్లు వివరించారు. సీటు పొందిన విద్యార్థులు ఈ నెల 23లోగా కళాశాలల్లో రిపోర్టు చేసుకోవాలన్నారు.

నిరసన ర్యాలీ విజయవంతం చేయండి

శ్రీకాకుళం న్యూకాలనీ: విజయవాడ ధర్నాచౌక్ వద్ద బుధవారం ఆంధ్రప్రదేశ్ లైబ్రరీ సైన్స్ నిరుద్యోగ జేఏసీ, డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో జరగనున్న శాంతియుత నిరసన ర్యాలీని విజయవంతం చేయాలని ఉత్తరాంధ్ర జిల్లాల నాయకుడు జామి శ్రీకాంత్‌బాబు మంగళవారం పిలుపునిచ్చారు. లైబ్రరీ సైన్స్ నిరుద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను కూటమి ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లాలన్నదే తమ ఉద్దేశమన్నారు. కొన్ని సంవత్సరాలుగా లైబ్రేరియన్ పోస్టులు భర్తీ చేయకపోవడంతో ఈ కోర్సు పూర్తిచేసిన వారు నిరుద్యోగులుగా మిగిలిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగ నియామక వయస్సు కూడా దాటిపోయి మానసిక సంఘర్షణ, ఆందోళనకు గురవుతున్నారని చెప్పారు.

మెరుగైన ఫలితాలే లక్ష్యం



విద్యార్థులతో మాట్లాడుతున్న జిల్లా వృత్తి విద్యాశాఖాధికారి సురేష్‌కుమార్

పాతపట్నం: ఇంటర్మీడియట్ పరీక్షలలో శతశాతం ఉత్తీర్ణత సాధించేలా అధ్యాపకులు కృషి చేయాలని, ఫిబ్రవరిలోనే ఇంటర్ పరీక్షలు షెడ్యూల్ ఉంటుందని జిల్లా వృత్తి విద్యాశాఖాధికారి ఆర్.సురేష్‌కుమార్ అన్నారు. మంగళవారం పాతపట్నం ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రమశిక్షణతో కూడిన విద్యను అందించాలని, విద్యార్థులపై ఎటువంటి ఒత్తిడి లేకుండా చూడాలన్నారు. ఆయనతో పాటు జిల్లా ప్రాంతీయ పర్యవేక్షణాధికారి దుర్గారావు, ప్రిన్సిపాల్ టి.హేమసుందరరావు, అధ్యాపకులు ఉన్నారు.

గంజాయి కేసులో పదేళ్ల జైలుశిక్ష

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం మున్సిపాలిటీ పరిధి పురుషోత్తపురం వద్ద 2022లో గంజాయి అమ్ముతూ పట్టుబడిన గణశ్యామ్ బెహరా, రెయ్యి త్రినాథ్, పైల వాసులకు పదేళ్ల జైలుశిక్ష, లక్ష రూయల జరిమానా విధిస్తూ శ్రీకాకుళం ఒకటో అదనపు జిల్లా సెషన్స్ కోర్టు జడ్జి పి.భాస్కరరావు తీర్పు వెల్లడించారని సీఐ మీసాల చిన్నంనాయుడు మంగళవారం తెలిపారు. జరిమానా చెల్లించకపోతే మరో ఆరు నెలల సాధారణ జైలుశిక్ష అనుభవించాల్సి ఉంటుందని సీఐ పేర్కొన్నారు.

బంగారం చోరీపై కేసు నమోదు

మెళియాపుట్టి: మండల కేంద్రం మెళియాపుట్టిలో దుక్క మధుసూదన్ రెడ్డి ఇంట్లో బంగారం చోరీకి గురైంది. ఎస్సై పిన్నింటి రమేష్ బాబు తెలిపిన వివరాల మేరకు.. మధుసూదన్ రెడ్డి ఇంట్లో కొద్దిరోజుల కిందట నగదు, బంగారం మాయమైంది. అయితే ఇంట్లో పని చేస్తున్న మహిళపై అనుమానంతో ప్రశ్నించగా ఏమీ తెలియదని సమాధానం ఇచ్చింది. ఈ మేరకు బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

అభ్యర్థులకు ఇంటర్వ్యూ మార్కులు తెలియజేయాలి

భువనేశ్వర్: ఒడిశా రాష్ట్ర సమచార హక్కు కమిషన్ చారిత్రాత్మక ఆదేశం జారీ చేసింది. ఎంపిక పరీక్షకు హాజరైన అభ్యర్థులకు ఇంటర్వ్యూ మార్కుల వివరాలు తెలియజేయాల్సిందేనని ఆదేశించింది. ప్రభావిత అభ్యర్థి అభ్యర్థన మేరకు ఒడిశా పబ్లిక్ సర్వీస్ కమిషన్‌కు ఈ ఆదేశాలు జారీ చేయడం విశేషం.

2022లో సహాయ ఉపాధ్యాయుని పదవికి ఎంపిక కాని అభ్యర్థికి ఇంటర్వ్యూ మార్కులు వివరాలు కావాలని ఒడిశా పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఓపీఎస్సీ)ను అభ్యర్థించారు. అది సాధ్యం కాదని ఓపీఎస్సీ అభ్యర్థిని నిరుత్సాహానికి గురిచేసింది. భద్రక్ జిల్లాకు చెందిన మీనతి రాణి మహాపాత్రో చరిత్ర విభాగం సహాయ ఉపాధ్యాయ ఉద్యోగానికి దరఖాస్తు చేసి అనుబంధ పరీక్షలకు హాజరైంది. ఆ ఉద్యోగ భర్తీకి అర్హత సాధించేందుకు కెరీర్ మార్కులు, ఇంటర్వ్యూ మార్కుల్ని పరిగణనలోకి తీసుకుంటారని నోటిఫికేషన్ పేర్కొంది. ఒడిశా పబ్లిక్ సర్వీస్ కమిషన్ 2022 జూన్‌లో విడుదల చేసిన అభ్యర్థుల జాబితాలో మీనతిరాణి మహాపాత్రో పేరు కనిపించలేదు. ఫలితాలతో అసంతృప్తి చెంది తన కెరీర్ రేటింగ్, ఇంటర్వ్యూలో వచ్చిన మార్కుల వివరాలను పబ్లిక్ సర్వీస్ కమిషన్ నుంచి కోరుతూ 2022 డిసెంబర్‌లో సమాచార హక్కు చట్టం కింద అభ్యర్థన పత్రం దాఖలు చేసింది. ఆ



అభ్యర్థన పట్ల పబ్లిక్ సర్వీస్ కమిషన్ పాక్షికంగా స్పందించింది. అభ్యర్థి కోరిన ప్రకారం ఒడిశా పబ్లిక్ సర్వీస్ కమిషన్ కెరీర్ మార్కులు మంజూరు చేసి ఇంటర్వ్యూ మార్కులు మంజూరు చేసేందుకు నిరాకరించింది. ఈ నేపథ్యంలో సమాచార కమిషన్ ముందు విచారణ సందర్భంగా.. ఒడిశా పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రతినిధి ఆ ఉద్యోగ ఎంపికకు ఎటువంటి ఇంటర్వ్యూ మార్కులు నమోదు చేయలేదు, కనీస మార్కుల ప్రామాణికత నిర్ణయించలేదని వివరించారు. ఒడిశా పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రతినిధి ఇంటర్వ్యూ అనేది అభ్యర్థుల వ్యక్తిత్వం, మాట్లాడే శైలి, నైపుణ్యాలు, మొదలైన వాటిని పరిశీలించే ప్రక్రియ మాత్రమే. ఇంటర్వ్యూలో పరిశీలన ఆధారంగా మాత్రమే అర్హత నిర్ణయించబడుతుందని సమాచార కమిషన్‌కు తెలియజేశారు. అభ్యర్థులు తగినవారో, కాదో మాత్రమే వారికి తెలియజేస్తారు. అభ్యర్థులకు నిర్దిష్ట మార్కులు ఇవ్వబడవు, ఎటువంటి మెరిట్ జాబితా ప్రచురించబడదని స్పష్టం చేశారు.

రాష్ట్ర ప్రధాన సమాచార కమిషనర్ మనోజ్ పరిడా తన చారిత్రాత్మక తీర్పులో ఒడిశా పబ్లిక్ సర్వీస్ కమిషన్ తీసుకున్న నిర్ణయం సమాచార హక్కు చట్టంలోని నిబంధనలకు విరుద్ధమని పేర్కొన్నారు. ఇంటర్వ్యూలో పొందిన మార్కులను తెలుసుకునే హక్కు అభ్యర్థికి ఉంది. ఇది తదుపరి ప్రయత్నంలో తన పని తీరును మెరుగుపరచుకోవడానికి సహాయపడుతుంది. ప్రతి అభ్యర్థికి, ముఖ్యంగా పరీక్షలో విఫలమైన అభ్యర్థికి, తాను ఏ ప్రాతిపదికన విజయం సాధించలేకపోయానో తెలుసుకునే హక్కు ఉంది. ఈ విషయంలో ఒడిశా పబ్లిక్ సర్వీస్ కమిషన్ అభ్యర్థులను అంధకారంలో ఉంచకూడదు. సమాచార హక్కు చట్టం, 2005లోని సెక్షన్ 22 కింద దరఖాస్తుదారులకు సమాచారం అందించడంలో అన్ని ఇతర చట్టాలు, నిబంధనలను అధిగమిస్తుందని తన ఉత్తర్వులో పేర్కొన్నారు. ఒడిశా పబ్లిక్ సర్వీస్ కమిషన్ తన విధానాన్ని మార్చుకోవాలని, అభ్యర్థులు పొందిన మార్కుల వివరాలను అందించాలని స్పష్టంగా ఆదేశించింది.

టీటీఈలకు బయోమెట్రిక్ హాజరు

భువనేశ్వర్: తూర్పు కోస్తా రైల్వే ఖుర్దా రోడ్ మండలం రైలు టికెట్ తనిఖీ సిబ్బంది (టీటీఈ)కి బయోమెట్రిక్ హాజరు నమోదు వ్యవస్థని ప్రవేశ పెట్టారు. రైల్వే కార్యకలాపాలలో పారదర్శకత, జవాబుదారీతనం దిశలో ఈ చర్య చేపట్టినట్లు అధికార వర్గాలు తెలిపాయి. ఈ చొరవతో సిబ్బంది విధుల నిర్వహణ ఆరంభం, ముగింపు రెండు దశల్లో (సైన్-ఇన్ మరియు సైన్-ఆఫ్) బయోమెట్రిక్ వ్యవస్థని అనుసరించాల్సి ఉంటుంది. ఈ విధానం తక్షణమే అమలులోకి వచ్చినట్లు ఖుర్దారోడ్ మండలం అధికారులు తెలిపారు. సిబ్బంది విధుల హాజరు వ్యవస్థ క్రమబద్ధీకరణ పురస్కరించుకుని మండల వ్యాప్తంగా ఖుర్దా రోడ్, పూరీ, భువనేశ్వర్, భద్రక్, జాజ్‌పూర్ కెంజొహర్ రోడ్, కటక్, బలుగాంవ్, బరంపురం, పలాస, ఢెంకనాల్, అంగుల్, పారాదీప్ 12 స్టేషన్లలో కంప్యూటరైజ్డ్ టీటీఈ లాబీలలో బయోమెట్రిక్ ఆధారిత లాగ్ ఇన్, లాగ్ ఆఫ్ వ్యవస్థని ప్రవేశపెట్టారు. ఖుర్దారోడ్ రైల్వే మండలం పరిధిలో దాదాపు 550 మంది టికెటు తనిఖీ సిబ్బంది హాజరుని ఈ వ్యవస్థ అధునాతన సాంకేతిక విధానంలో పారదర్శకంగా పర్యవేక్షిస్తుంది.

భారతీయ రైల్వే దేశవ్యాప్తంగా ఈ వ్యవస్థని 950 పైబడి ప్రదేశాల్లో విజయవంతంగా అమలు చేసింది. భారత ప్రభుత్వ ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్



బయోమెట్రిక్ హాజరు నమోదు చేస్తున్న టీటీఈ

టెక్నాలజీ శాఖ అధీనంలో సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్ (సీ – డీఏసీ) సమన్వయంతో బయోమెట్రిక్ వ్యవస్థను అభివృద్ధి చేశారు.

ఈ వ్యవస్థ ఆధార్ ఆధారిత వేలిముద్ర ప్రామాణీకరణ పరికరాలను ఉపయోగిస్తుంది, యూడీఏఐ, ఎస్‌టీక్యూసీ ధృవీకరణతో ఈ-ప్రమాణ్ పోర్టల్ అనుసంధానంతో పని చేస్తుంది. న్యూ ఢిల్లీ టీటీఈ లాబీలో ప్రయోగాత్మకంగా అమలు చేసి కార్యాచరణ ధృవీకరించి దేశవ్యాప్తంగా ఇతర ప్రాంతాల్లో అంచెలంచెలుగా ప్రవేశ పెడుతున్నారు. బయో మెట్రిక్ హాజరు నమోదు రైలు ప్రయాణికుల సౌకర్యాల రంగంలో అనుబంధ సిబ్బంది సామర్థ్యం మరియు పారదర్శకతను బలోపేతం చేసి ప్రయాణీకులకు మెరుగైన సేవల్ని అందజేసేందుకు దోహదపడుతుంది.

హోటల్‌పై దుండగుల దాడి

జయపురం: జయపురం సదర్ పోలీసు స్టేషన్ ప్రాంతంలో కొంత మంది దుండగులు హోటల్‌పై దాడి చేసి యజమానిని, పనివారిని కొట్టి సరుకులను ధ్వంసం చేశారని పట్టణ పోలీసు అధికారి ఉల్లాస పాత్రో రౌత్ మంగళవారం తెలిపారు. హోటల్ యజమాని వాల్మీకి మహాపాత్రో ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీస్ అధికారి వెల్లడించారు. ఈ నెల 6వ తేదీన కొంతమంది దుండగులు హోటల్‌కు వచ్చి రూ.5 వేలు అడిగారని, డబ్బులు ఇవ్వకపోతే హోటల్ మూసివేయాలని హెచ్చరించారు. దుండగులను యజమాని, హోటల్ పనివారు ఎదిరించటంతో వారిపై మారణాయుధాలతో కొట్టారు. సమగ్రిని ధ్వంసం చేశారు. మహాపాత్రో మెడలో ఉన్న బంగారు గొలుసు తెంచుకుపోయారు. దుండగులను పట్టుకుంటామని పోలీసు అధికారి వెల్లడించారు.

ట్యాంకర్‌ను ఢీకొన్న అమొ బస్సు



దుర్ఘటనలో నుజ్జు అయిన అమొ బస్సు

భువనేశ్వర్: ఖుర్దా జిల్లా 16వ నంబరు జాతీయ రహదారిపై అమొ బస్సు ప్రమాదానికి గురైంది. టంగి ప్రాంతం ఛొటిలో గొడా కూడలి సమీపంలో మంగళవారం ట్యాంకర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో పలువురు గాయ పడ్డారు. వారిలో 15 మంది గాయపడ్డారు. ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు. వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా మారడంతో సత్వర ఉన్నత చికిత్స కోసం కటక్ ఎస్‌సీబీ వైద్య కళాశాల ఆస్పత్రికి తరలించారు. టంగి థానాలో పోలీసులు ఘటనా స్థలం చేరి కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

500 కిలోల గంజాయి స్వాధీనం

- జిల్లా వ్యాప్తంగా అబ్కారీశాఖ దాడులు
- గంజాయి, నాటుసారా, మద్యం పట్టివేత
- ఐదుగురు అరెస్టు


పర్లాకిమిడి: గజపతి జిల్లా కలెక్టర్ మధుమిత ఆదేశాల మేరకు జపతి జిల్లా అబ్కారీశాఖ సూపరింటెండెంట్ ప్రదీప్ కుమార్ సాహు మంగళవారం స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. గంజాయి, సారాయి అక్రమంగా రవాణా చేస్తున్న ఐదుగురు నిందితుల్ని అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. వీరిలో ఒక మహిళ ఉంది. జిల్లాలో గుసాని సమితి గారబంద పి.ఎస్.పరిధిలో అడాసింగి, రాయఘడ బ్లాక్ మర్లబ, గుమ్మా బ్లాక్ సెరంగో పి.ఎస్.పరిధిలో బార్తై తదితర గ్రామాల్లో 500 కిలోల గంజాయి, 20 లీటర్ల బెల్లం ఊట, 30 లీటర్ల మద్యాన్ని



గంజాయి బస్తాలతో పట్టుబడిన నిందితుడు, కారు

స్వాధీనం చేసుకున్నారు. వారి వద్ద నుంచి ఒక బైక్, కారును స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో ఆర్.ఉదయగిరి అబ్కారీ శాఖ అధికారి మోన్ను ఆయాల్, మోహనా ఎస్ఐ కె.బాలాజీ, పర్లాకిమిడి సదర్ ఎక్సైజ్ ఎస్ఐ ప్రశాంత్ పటేల్, తదితరులు పాల్గొన్నారు.

● కొత్త ఉపరాష్ట్రపతికి కళాత్మక శుభాకాంక్షలు



15వ భారత ఉప రాష్ట్రతిగా ఎన్నిక అయిన సీపీ రాధాకృష్ణన్‌కు ప్రముఖ సైకత శిల్పి సుదర్శన్ పట్నాయక్ కళాత్మకంగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పూరీ సాగర తీరంలో సువిశాల సైకత శిల్పాన్ని తీర్చిదిద్దారు. – భువనేశ్వర్/పూరీ

గజపతి జిల్లాలో అధికారుల పర్యటన



అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించిన రాష్ట్ర నోడల్ సెక్రటరీ తిరుమల, అధికారులు

పర్లాకిమిడి: గజపతి జిల్లాలో జిల్లా నోడల్ సెక్రటరీ, భువనేశ్వర్ డెవలప్‌మెంట్ ఆథారిటీ (బీడీఏ) ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎస్.తిరుమల రెండు రోజుల పర్యటనలో ఆర్.ఉదయగిరి ఇండోర్ స్టేడియంలో అంత్యోదయ పథకం గృహాలు లబ్ధిదారులకు తాళాలు అందజేశారు. అనంతరం నువాగడ బ్లాక్‌లో ఖోజురిపద బ్లాక్ ఆరోగ్య కేంద్రానికి వెళ్లి అక్కడ రోగులకు ఉత్తమ చికిత్స అందజేయాలని డాక్టర్లు, సిబ్బందిని ఆదేశించారు. రాయఘడ బ్లాక్‌లో జయమా మిషన్ శక్తి కుట్టుమిషన్ల కేంద్రాన్ని సందర్శించి అక్కడ మహిళా స్వయం సహాయక గ్రూపులతో మాట్లాడారు. తర్వాత రాయఘడ బ్లాక్‌లో దంబాపూర్ వద్ద అంగన్‌వాడీ కేంద్ర నిర్మాణ పనులను సందర్శించి, సుభద్ర పథకం లబ్ధిదారులతో మాట్లాడారు. నోడల్ సెక్రటరీ వెంట జిల్లా కలెక్టర్ మధుమిత, సబ్ కలెక్టర్ అనుప్ పండా, ఆదనపు కార్యనిర్వాహణ అధికారి పృథ్వీరాజ్ మండల్, జిల్లా సంక్షేమ శాఖ అధికారి సాల్మన్ రైకా, ఒడిశా జీవనోపాదుల పీడీ టిమోన్ బోరా, ఆర్.ఉదయగిరి, నువాగడ, రాయగడ బీడీఓ ఉన్నారు.



ఆర్.ఉదయగిరిబ్లాక్ ఖోజురిపద పీహెచ్‌సీని సందర్శించిన నోడల్ సెక్రటరీ తిరుమల



అంత్యోదయ గృహ పథకం లబ్ధిదారుకి తాళం అప్పగిస్తున్న నోడల్ సెక్రటరీ తిరుమల

డొంగిరీగుడలో అధికారుల పర్యటన

జయపురం: జయపురం సబ్‌డివిజన్ కొట్‌పాడ్ సమితి డొంగిరిగుడ గ్రామాన్ని రాష్ట్ర గవర్నర్ కార్యదర్శి రూపారోషణ సాహు మంగళవారం సందర్శించారు. చేనేత పనివారితో చర్చించారు. ప్రసిద్ధి గాంచిన కొట్‌పాడ్ చేనేత వస్త్రాలపైన, చేనేత పనివారి సమస్యలపైన చర్చించారు. జయపురం సబ్‌కలెక్టర్ కుమారి అక్కవర శౌశ్యారెడ్డి, కొట్‌పాడ్ బీడీఓ సంధ్యా సమరత్, జిల్లా సంక్షేమ అధికారి సునీల్ తండి, ఐటీడీఏ కార్యనిర్వాహక ఇంజినీర్ చైతన్య బాసికి తదితరులు పాల్గొన్నారు.



డొంగిరిగుడలో పర్యటిస్తున్న గవర్నర్ కార్యదర్శి, తదితరులు

ఎమ్మెల్యే దృష్టికి తడమ పంచాయతీ సమస్యలు



సమస్యలపై ఎమ్మెల్యేకు వినతిపత్రాన్ని సమర్పిస్తున్న మహిళలు

రాయగడ: రాయగడ శాసన సభ నియోజక వర్గం పరిధిలోని తడమ పంచాయతీలో నెలకున్న సమస్యలను ఎంఎల్ఏ అప్పల స్వామి కద్రక విన్నారు. పంచాయతీ పరిధిలోని వివిధ గ్రామాల్లో మంగళవారం ఎమ్మెల్యే పర్యటించారు. ప్రజల ఆరోగ్య భద్రతకు గల ఆయుష్మాన్ ఆరోగ్య మందిరంలో సరిగ్గా వైద్యులు ఉండటం లేదని మహిళలు ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. వైద్యులు సకాలంలో వైద్య సేవలు పొందలేకపోతున్నామని ఎంఎల్ఏకు సమర్పించిన వినతిపత్రంలో పేర్కొన్నారు. దీంతో అత్యవసర పరిస్థితిలో చికిత్స కోసం జిల్లా కేంద్రాస్పత్రిపై ఆధారపడాల్సి వస్తుందని వివరించారు. దీనిపై స్పందించిన ఎంఎల్ఏ ఈ సమస్య వైద్య శాఖ అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అలాగే పంచాయతీలోని వివిధ గ్రామాల్లో కనీస మౌలిక సౌకర్యాలు లేక ప్రజలు పడుతున్న అవస్థలను తెలుసుకున్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

ఇచ్ఛాపురం : విశాఖపట్నం సీతమ్మధారలో మూగబాలికపై అత్యాచారానికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని వైఎస్సార్ సీపీ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్-1 ఉలాల భారతి దివ్య డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక విలేకరులతో ఆమె మాట్లాడుతూ కూటమి పాలనలో మహిళలకు, బాలికలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. నేరస్తులను వెంటనే పట్టుకుని ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా శిక్ష విధించాలని డిమాండ్ చేశారు. బాధితురాలికి న్యాయం చేయాలని కోరారు.

బాల్యానికి.. చిక్కుముడి!

- జిల్లాలో ఆగని బాల్య వివాహాలు
- రాష్ట్రంలో మూడో స్థానం
- చదువుకు దూరమవుతున్న బాలికలు
- జీవితాంతం వెంటాడుతున్న రుగ్మతలు



బాల్య వివాహాలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు



ఎల్ఎన్‌పేట మండలంలోని ఓ గ్రామంలో ఇంటర్మీడియెట్ చదువుతున్న బాలికకు తల్లిదండ్రులు వివాహం చేయాలని నిశ్చయించారు. సన్నాహాలు కూడా ప్రారంభించారు. విషయం తెలుసుకున్న ఐసీడీఎస్ అధికారులు గ్రామానికి చేరుకొని తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. చిన్న వయసులో వివాహం జరిపితే కలిగే అనర్థాలను వివరించారు. దీంతో తల్లిదండ్రులు వివాహాన్ని వాయిదా వేసుకున్నారు.

హిరమండలానికి ఓ కుటుంబం ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా పదో తరగతి చదువుతున్న కుమార్తెకు వివాహం జరపాలని నిర్ణయించారు. బాలికకు పెళ్లి ఇష్టం లేదు. దీంతో స్నేహితుల ద్వారా చైల్డ్‌లైన్ అధికారులను ఆశ్రయించింది. వారు వచ్చి కౌన్సెలింగ్ ఇవ్వడంతో తల్లిదండ్రులు వివాహాన్ని వాయిదా వేసుకున్నారు.

హిరమండలం: బడిబాట పట్టాల్సిన బాలికలు పెళ్లి పీటలెక్కుతున్నారు. తెలిసీ తెలియని వయసులో వారిని మూడుముళ్ల బంధంలో చిక్కుకుంటున్నారు. చదువు, ఆటపాటలతో హాయిగా గడవాల్సిన సమయంలో గర్భం దాల్చుతున్నారు. అనారోగ్య సమస్యల బారిన పడుతున్నారు. అధికారులు అవగాహన కల్పిస్తున్నా ఆర్థిక ఇబ్బందులు, కట్టుబాట్లతో పెద్దలే చిన్నారులకు పెళ్లిచేసి అత్తారింటికి పంపుతున్నారు. జిల్లాలో ప్రధానంగా వలసలు వెళ్లే పాతపట్నం, పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గాల్లో ఈ పరిస్థితి తీవ్రంగా ఉంది. జిల్లాలో 11 తీర ప్రాంతాల్లో సైతం బాల్య వివాహాలు అధికంగా జరుగుతున్నట్టు తెలుస్తోంది. మరోవైపుగా గిరిజన ప్రాంతాల్లో బాల్య వివాహాలు అనేవి ఒక సంప్రదాయంగా వస్తున్నాయి. అక్కడ కులం కట్టుబాట్లతో ఎక్కువగా చిన్ననాటే పెళ్లిళ్లు జరిపిస్తున్నట్టు తెలుస్తోంది.

ఇదీ పరిస్థితి..

జిల్లాలో చాలావరకూ బాల్య వివాహాలు అదుపులోకి వచ్చాయి. అవగాహన ఉన్నవారు తమ పిల్లల విషయంలో చాలా రకాలుగా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. అయినప్పటికీ, నిరక్షరాస్యులు మాత్రం ఆడపిల్లలను భారంగా పరిగణించి బాల్య వివాహాలు చేసేస్తున్నారు. సమాచారం అందుకుంటున్న అధికారులు 2020–21లో 114, 2021–22లో 68, 2022–23లో 144, 2023–24లో 96, 2024–25లో 28 బాల్య వివాహాలను అడ్డుకున్నారు. 2025–26కు సంబంధించి 18 బాల్య వివాహాలను అడ్డుకుంటున్నట్టు గణాంకాలు చెబుతున్నాయి.

ఆర్థిక భారంతో..

శ్రీకాకుళం ప్రధానంగా వలసల జిల్లా. చాలా గ్రామాల్లో భార్య, భర్త ఇద్దరూ పనికి వెళితే గానీ పూటగడవని పరిస్థితి. ఈ నేపథ్యంలో పదో తరగతి వరకూ ఆడపిల్లలను చదివించి వెంటనే వివాహాలు జరిపించేస్తున్నారు. ఇలా చేస్తే తమ బాధ్యత తీరిపోతుందని అనుకుంటున్నారే తప్ప.. బాల్య వివాహాలతో తమ పిల్లలను అనారోగ్య కూపంలోకి తోసివేస్తున్నామన్న విషయాన్ని గుర్తించడం లేదు.

ఆ జాబితాలో జిల్లా..

రాష్ట్రంలో 45 శాతానికి మించి బాల్య వివాహాలు జరుగుతున్న జిల్లాల్లో శ్రీకాకుళం మూడోస్థానంలో ఉండడం ఆందోళన కలిగిస్తోంది. అందులో 23 శాతం మంది 15 నుంచి 18 సంవత్సరాల్లోపు బాలికలే అమ్మలుగా మారుతున్నారు. బాల్యంలో తల్లులు కావడం అనేది గతంతో పోల్చుకుంటే తగ్గినప్పటికీ.. బాల్య వివాహాలు మాత్రం ఆగకపోడం ఆందోళన కలిగిస్తోందని జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే స్పష్టం చేసింది. 15 నుంచి 19 ఏళ్ల వయసులోపు బాలికలు నిర్దేశిత బరువు కంటే తక్కువగా ఉంటారు. తల్లిగా మారే సమయంలో బాడీ మాస్ ఇండెక్స్ తగ్గడంతో వారి ప్రాణాలకు ముప్పు వాటిల్లుతోంది. ఈ పరిస్థితుల్లో బిడ్డ గర్భంలో చనిపోవడం, వైకల్యంతో పుట్టడం, ఆరోగ్యకరమైన ఎదుగుదల లేకపోవడం వంటి సమస్యలు ఎదురవుతున్నాయి.

ఫిర్యాదు చేయవచ్చు..

బాల్య వివాహాలు జరిగితే నిర్భయంగా 1098, 100, 181 వంటి టోల్‌ఫ్రీ నంబర్లకు ఫిర్యాదు చేయవచ్చు. సమీపంలోని అంగన్‌వాడీ కేంద్రాలకు సైతం సమాచారం అందించవచ్చు. జిల్లా అధికారులు రంగంలోకి దిగి స్థానిక పోలీసుల సహకారంతో తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తారు. కేంద్ర ప్రభుత్వం బాల్య వివాహాల నియంత్రణకు 'బాల్ వివాహ్ ముక్త్ భారత్' కార్యక్రమం చేపట్టింది. దీని ద్వారా కూడా బాల్య వివాహాల సమాచారం చేరవేయవచ్చు. అయితే, ఇటీవల ఫేక్ ఫిర్యాదులు చేస్తుండటం కూడా ఆందోళన కలిగిస్తోంది. ప్రేమ వ్యవహారాల కారణంగా కొంతమంది తప్పుడు ఫిర్యాదులు చేస్తున్నారు. నిజంగా బాల్య వివాహం జరుపుతుంటే మాత్రం నిర్భయంగా ఫిర్యాదు చేయవచ్చు. అధికారులు వచ్చి తప్పకుండా అడ్డుకుంటారు.

చట్టరీత్యా నేరం..



బాల్య వివాహాలు చట్టపరంగా నేరం. ఎక్కడైనా బాల్య వివాహాలు జరిపిస్తే ఫిర్యాదు చేయాలి. ఎటువంటి భయం అవసరం లేదు. స్థానిక పోలీసుల రక్షణలోనే విచారణ జరుగుతుంది. తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తాం. వారి సమ్మతితోనే వివాహాన్ని నిలుపుదల చేయిస్తాం. బాల్య వివాహాలతో అనారోగ్యం తప్పదు. ప్రతిఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలి. దీనిపై గ్రామస్థాయిలో అవగాహన కల్పిస్తున్నాం

– ఐ.విమల, ఐసీడీఎస్ పీడీ, శ్రీకాకుళం

క్లుప్తంగా

పుష్పాలంకరణలో పైడితల్లి



పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్న అమ్మవారు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ పైడితల్లి అమ్మవారు మంగళవారం పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఏడిద రమణ ఆధ్వర్యంలో అమ్మవారికి వేకువజామునుంచి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, తాళ్లపూడి ధనుంజయ్, నేతేటిప్రశాంత్‌లు శాస్త్రోక్తంగా నిత్య పూజాదికాలు చేశారు. మహిళలు అమ్మవారిని దర్శించి పసుపు, కుంకుమలను సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారిణి కె.శిరీష కార్యక్రమాలను పర్యవేక్షించారు.

సమాచార శాఖ ఎ.డికి డీడీగా పదోన్నతి



డీడీగా పదోన్నతి పొందిన లోచర్ల రమేష్

పార్వతీపురం రూరల్: జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి, సహాయ సంచాలకుడు లోచర్ల రమేష్‌కు డిప్యూటీ డైరెక్టర్‌గా పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గత నెలలో శాఖాపరమైన పదోన్నతుల కమిటీలో రాష్ట్ర వ్యాప్తంగా ఆరుగురు ఎ.డిలకు పదోన్నతి కల్పించారు. ఈ క్రమంలో ఆయనకు డీడీగా పదోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. 1996లో ఏపీ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా పౌర సంబంధాల అధికారిగా రమేష్ ఎంపికై హైదరాబాద్, విశాఖపట్నం, పాడేరు, టెక్కలి, పార్వతీపురం, శ్రీకాకుళంలలో వివిధ హోదాల్లో పనిచేశారు. ప్రస్తుతం పదోన్నతిపై డిప్యూటీ డైరెక్టర్‌గా గుంటూరు జిల్లాకు నియమించారు.

వ్యక్తి ఆత్మహత్య



ఆత్మహత్యకు పాల్పడిన వెంకటరావు

విజయనగరం క్రైమ్: స్థానిక రెండవ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇందుకు సంబంధించి ఎస్సై కనకరాజు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నగరంలోని వైఎస్సార్ నగర్‌కు చెందిన బెవర వెంకటరావు (36) మద్యానికి బానిసవడంతో పాటు అప్పులు ఎక్కువ చేశాడు. అప్పులు బాధ తాళలేక మద్యం అలవాటును మానలేక డబ్బులు చాలక ఈనెల 8వతేదీ రాత్రి ఇంట్లోనే ఉరివేసుకున్నట్లు భార్య భారతి టుటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈమేరకు ఎస్సై కనకరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతుడికి ఐదేళ్ల బాబు, మూడేళ్ల పాప ఉన్నారు.

గడ్డిమందు తాగి వృద్ధురాలు..

సంతకవిటి: మండలంలోని గోవిందపురం గ్రామానికి చెందిన పాలవలస లక్ష్మి(69) ఆరోగ్యం క్షీణించడంతో గడ్డిమందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఏఎస్సై ఎం.వాసుదేవరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం లక్ష్మికి 15 సంవత్సరాల క్రితం మెడకు విశాఖపట్నంలో ఆపరేషన్ జరిగి క్రమేణా ఆరోగ్యం క్షీణించడంతో తన పని కూడా తాను చేసుకోలేని స్థితిలో ఉంది. దీంతో మనస్తాపం చెందిన ఆమె సోమవారం గడ్డిమందు తాగడంతో కుటుంబసభ్యులు శ్రీకాకుళంలోని ఓ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ మేరకు మృతురాలి కుమారుడు అన్నారావు మంగళవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

ఢిల్లీ వెళ్లిన జిందాల్ నిర్వాసితులు



ఢిల్లీ వెళ్తున్న జిందాల్ నిర్వాసితులు

శృంగవరపుకోట: జిందాల్ యాజమాన్యం కంపెనీ పేరుతో లాక్కున్న భూములు తమకు అప్పగించాలంటూ మూడు నెలలుగా ఆందోళన చేస్తున్న జిందాల్ నిర్వాసితులు తమ గోడు వినిపించేందుకు ఢిల్లీబాట పట్టారు. సోమవారం అర్ధరాత్రి విశాఖ చేరిన నిర్వాసితులు అక్కడి నుంచి ఢిల్లీ వెళ్లారు. 10, 11 తేదీల్లో ఢిల్లీలో జంతర్‌మంతర్ వద్ద తమ గోడు వినిపిస్తామన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇక్కడ తాము చేస్తున్న నిరసనలను పోలీసులతో చంద్రబాబు సర్కారు అడ్డుకుంటోందని, ఢిల్లీలో ఆందోళనలకు అనుమతి లభించిందన్నారు.

కొంతమందికే ఇంటింటికీ రేషన్

☛ ఈ కింది ఫొటోలో కనిపిస్తున్న దృశ్యం విజయనగరం పట్టణంలోని గోకపేటలోనిది. గోకపేట రేషన్ డిపో నుంచి బియ్యాన్ని సైకిల్ పై వేరే మహిళ సహాయంతో వృద్ధురాలు ఇంటికి తీసుకుని వెళ్తోంది.



గోకపేటరేషన్ డిపో నుంచి సైకిల్‌పై బియ్యం తీసుకుని వెళ్తున్న వృద్ధురాలు

- పూర్తిస్థాయిలో వృద్ధుల ఇంటికి చేరని బియ్యం
- జిల్లాలో రైస్ కార్డులు 5,73,137
- వాటిలో 65 ఏళ్లు దాటిన వారు 69,246 మంది

విజయనగరంఫోర్ట్:

ఇది ఈ ఇద్దరి పరిస్థితే కాదు. జిల్లాలోని అనేక మంది వృద్ధులకు ఎదురవుతున్న దుస్థితి. ఇంటింటికీ వెళ్లి రేషన్ అందించే ప్రక్రియకు కూటమి సర్కార్ స్వస్తి పలికింది. దీంతో ప్రజలకు కష్టాలు మొదలయ్యాయి. అయితే 65 ఏళ్ల దాటిన వృద్ధుల ఇంటికే రేషన్ సరుకులు అందిస్తామని కూటమి సర్కార్ చెప్పింది. అది కూడా పూర్తిస్థాయిలో అమలు కావడంలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొంతమందికే రేషన్ అందిస్తున్నారనే విమర్శలు తలెత్తుతున్నాయి.

జిల్లాలో రైస్ కార్డులు 5,74,137

జిల్లాలో రైస్ కార్డులు 5,71,137 ఉన్నాయి. వారందరికీ ప్రతి నెల రేషన్ డిపోల ద్వారా సరుకులు అందించాల్సి ఉంది. వారిలో 65 ఏళ్ల దాటినవారు



ఈ ఫొటోలో కనిపిస్తున్న వృద్ధురాలిపేరు పి.సీతారామలక్ష్మమ్మ. ఈమెది విజయనగరం పట్టణంలోని అలకానందకాలనీ. ఈమెకు 81 సంవత్సరాలు. ఈమెకు ఇంటికి రేషన్ ఇవ్వడం లేదు.

69,246 మంది ఉన్నారు. వారందరికీ ఇంటింటికి వెళ్లి రేషన్ సరుకులు అందించాల్సి ఉంది. కానీ వారికి పూర్తిస్థాయిలో ఇంటికి రేషన్ సరుకులు అందడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

గత ప్రభుత్వంలో ఇంటింటికీ రేషన్ పంపిణీ

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో రైస్ కార్డు దారులు ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో ఎండీయూ వాహనాల ద్వారా ఇంటింటికీ రేషన్ సరుకులు అందించారు. అన్ని వర్గాల ప్రజల ఇంటికే వెళ్లి రేషన్ అందించడం వల్ల వారికి ఇబ్బందులు తప్పాయి. గంటల తరబడి రేషన్ సరుకుల కోసం నిరీక్షించాల్సిన పని ఉండేది కాదు. దీని వల్ల పనులు మానుకుని ఉండాల్సి వచ్చేది కాదు. ముఖ్యంగా గిరిజన ప్రాంతాల్లో ఉన్నవారు, రేషన్ డిపో దూరంగా ఉన్నవారు 2,3 కిలోమీటర్లు నడిచి వెళ్లి రేషన్ సరుకులు తెచ్చుకోవాల్సిన పరిస్థితి. అటువంటి వారికి ఇంటికి వెళ్లి సరుకులు అందించేవారు. దీనివల్ల వారికి వ్యయ ప్రయాసలు తగ్గేవి. కానీ కూటమి సర్కార్ పాలనలో రేషన్ సరుకుల కోసం వాగులు, వంకలు, దాటుకుని వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో గిరిజన ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

వృద్ధుల ఇంటికి సరుకులు ఇవ్వాలి

> 65 ఏళ్ల దాటిన వృద్ధుల ఇంటికి వెళ్లి సంబంధిత రేషన్ డీలర్ రేషన్‌సరుకులు ఇవ్వాలి. ఎక్కడైనా ఇవ్వకపోతే చర్యలు తీసుకుంటాం.
> – మురళీనాథ్, జిల్లా పౌరసరఫరాల అధికారి

ఇంటింటికీ వెళ్లే ఆసక్తి లేదనే ఆరోపణలు

65 ఏళ్ల నిండిన వారి ఇంటికి రేషన్ సరుకులు ఇవ్వడానికి డీలర్లు అసక్తి చూపడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీని వల్ల వృద్ధులు రేషన్ డిపోలకు వెళ్లి సరుకులు తీసుకోవాల్సి వస్తోంది. ఇది వ్యయప్రయాసలతో కూడుకున్నదే అయినప్పటికీ తప్పని పరిస్థితి.

మాదక ద్రవ్యాల నియంత్రణకు 'సంకల్ప రథం'తో ప్రచారం



'సంకల్ప రథం'తో డ్రగ్స్‌పై అవగాహన కల్పిస్తున్న పోలీస్ శాఖ

విజయనగరం క్రైమ్: మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలను యువతకు వివరించి, వారిని ఆ అలవాటుకు దూరం చేసేందుకు క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పించేందుకు 'సంకల్ప రథం'తో ప్రచారం చేపడుతున్నామని ఎస్పీ వకుల్ జిందల్ మంగళవారం తెలిపారు. యువతతో పాటు డ్రగ్స్ అలవాటు ఉన్న వ్యక్తులు, ప్రజలకు ఈ 'సంకల్పం' కార్యక్రమాన్ని మరింత చేరువ చేసేందుకు జిల్లా వ్యాప్తంగా రథాన్ని ప్రారంభించామన్నారు. డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేకంగా 'సంకల్ప రథం' రూపొందించామన్నారు. ప్రతిరోజూ ఒక మండలాన్ని సందర్శించి, స్థానిక పోలీస్‌స్టేషన్ అధికారి, సిబ్బంది సహకారంతో ఉదయం కళాశాలల్లో వాహనాన్ని నిలిపి, విద్యార్థులకు డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలను వివరిస్తున్నామన్నారు. అదే విధంగా సాయంత్రం సమయాల్లో మండలంలోని ముఖ్య ప్రాంతం లేదా కూడలిలో వాహనాన్ని నిలిపి, ప్రజలు, యువతకు మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ వారిలో చైతన్యం కల్పిస్తున్నామన్నారు. ఇప్పటికే రెండు విడతలుగా 'సంకల్ప రథం'తో అవగాహన కార్యక్రమాలు పూర్తి చేశామన్నారు. మూడో విడతగా ప్రచార కార్యక్రమాన్ని జూన్ 2 నుంచి ఆగస్టు 16 వరకు నిర్వహించినట్లు తెలిపారు. కొత్తగా ఒక షెడ్యూల్‌ను రూపొందించి ఆ ప్రకారం స్థానిక పోలీస్‌అధికారులు, సిబ్బంది ప్రతిరోజూ ఒక మండలంలోని ఒక కళాశాల, ముఖ్య కూడలిలో వాహనాన్ని నిలిపి, మాదక ద్రవాలవల్ల కలిగే దుష్ప్రభావాలపై వీడియోలు ప్రదర్శించి, వివరించామని ఎస్పీ తెలిపారు. జిల్లాలోని అన్ని మండలాలను సంకల్ప రథం సందర్శించే విధంగా షెడ్యూల్ రూపొందించామని ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు.

హోంగార్డు కుటుంబానికి 'చేయూత'



హోంగార్డ్ కుటుంబానికి 'చేయూత' చెక్కును ఇస్తున్న ఎస్పీ వకుల్ జిందల్

విజయనగరం క్రైమ్: జిల్లా పోలీస్‌శాఖలో హోంగార్డుగా పని చేసి, ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన ఎంవీ కృష్ణారావుకు 'చేయూత' అందించేందుకు సిబ్బంది పోగు చేసిన ఒక్క రోజు డ్యూటీ అలవెన్సు రూ.3,22,340/ల చెక్కును ఎస్పీ వకుల్ జిందల్ మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో అందజేశారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ పోలీసుశాఖలో పని చేస్తూ ప్రమాదవశాత్తు లేదా అనారోగ్యంతో మరణించిన లేదా ఉద్యోగ విరమణ చేసిన హోంగార్డు కుటుంబాలను ఆర్థికంగా ఆదుకుంటున్నామన్నారు. ఆ కుటుంబాన్ని ఆదుకునేందుకు హోంగార్డ్స్' స్వచ్ఛందంగా ముందుకు వచ్చి, ఒక్క రోజు డ్యూటీ అలవెన్సు మొత్తాన్ని పోగు చేసి, వారి కుటుంబాలకు చేయూతగా అందజేయడం అభినందనీయమన్నారు. ఈ తరహా చర్యలు చేపట్టడం వల్ల పోలీస్ ఉద్యోగుల్లో ఐకమత్యం పెరగడంతో పాటు, వారి కుటుంబాలకు అండగా ఉన్నామన్న భరోసా లభిస్తుందని ఎస్పీ వకుల్ జిందల్ అన్నారు. కార్యక్రమంలో హోంగార్డ్స్ ఇన్‌చార్జ్ ఆర్ఐ ఆర్.రమేష్ కుమార్, ఆఫీసు సూపరింటెండెంట్ టి.రామకృష్ణ, పోలీసు కుటుంబసభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీని అధికారంలోకి తెచ్చేందుకు కృషిచేద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు జాన్‌వెస్లీ

- రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు జాన్‌వెస్లీ

పార్వతీపురం రూరల్: వైఎస్సార్‌సీపీని అధికారంలోకి తెచ్చేందుకు క్రిస్టియన్ మైనార్టీలంతా కృషిచేయాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీసెల్ అధ్యక్షుడు జాన్ వెవెస్లీ అన్నారు. ఈ మేరకు మంగళవారం జిల్లా వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ క్రిస్టియన్ మైనార్టీ సంక్షేమానికి కృషిచేస్తూ పార్వతీపురం మన్యంజిల్లాలో మైనార్టీల అభివృద్ధి కోసం పేద, వెనుకబడిన వర్గాల సమస్యల పరిష్కా రానికి కృషిచేస్తామన్నారు. క్రైస్తువులంతా ఏకమై వైఎస్సార్‌సీపీని అధికారంలోకి తెవడానికి కృషిచేయాలని పిలుపునిచ్చారు. సంక్షేమానికి పెద్దపీట వేస్తూ కుల, మత, ప్రాంత, పార్టీల భేదం లేకుండా ఇళ్లకే పథకాలందించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని అధికారంలోకి తెచ్చుకు నేందుకు ముందస్తు ప్రణాళికలతో క్రైస్తవ సోదరులంతా ఏకం కావాలని కోరారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగంతో ప్రజాస్వామ్యాన్ని ఖూనీచేస్తూ అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ అనేక వర్గాల వారిని అవస్థలకు కూటమి ప్రభుత్వం గురిచేస్తోందన్నారు. అనంతరం ఆయన నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న జిల్లా వ్యాప్తంగా ఉన్న క్రిస్టియన్ మైనార్టీ నాయకులకు తదుపరి కార్యాచరణపై వివరించారు. కార్యక్రమంలో జిల్లా క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు శ్రీనివాసరావు, రాష్ట్ర జాయింట్ సెక్రటరీ లక్ష్మణరావు, సాలూరు, కురుపాం మైనార్టీసెల్ అధ్యక్షులు సువార్త రాజు, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తూనికల్లో తేడాలొస్తే చర్యలు



స్వాధీనం చేసుకున్న కాటాలు, గుళ్లను చూపిస్తున్న అధికారులు

రాజాం సిటీ: తూనికల్లో తేడాలొస్తే కఠిన చర్యలు తీసుకుంటామని బొబ్బిలి, శ్రీకాకుళం లీగల్ మెట్రాలజీ అధికారులు ఉమాసుందరి, బలరాంకృష్ణలు అన్నారు. ఈ మేరకు మంగళవారం రాజాంలో విస్తృతంగా దాడులు నిర్వహించారు. పండ్ల దుకాణాలు, వ్యాపార సంస్థల్లో వినియోగిస్తున్న కాటాలను పరిశీలించారు. ఈ సందర్భంగా 300 నుంచి 400 గ్రాముల వరకు తూకంలో తేడాలు గుర్తించారు. మొత్తం 40 మందిపై కేసులు నమోదుచేయడంతో పాటు కాటాలను, సీల్ లేని ఇనుపగుండ్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తూనికల్లో తేడాలు లేకుండా విక్రయాలు జరపాలని, అలాగే ఎంఆర్‌పీ కంటే అధికంగా విక్రయాలు చేపట్టినా కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఎక్కువగా పండ్ల దుకాణాల్లో మోసాలు జరుగుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, మరోసారి ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఎయిడ్స్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన పొందాలి

- కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్
- పార్వతీపురంలో మారథాన్ 5కె రెడ్‌రన్




మార్‌థాన్ 5కె రెడ్‌రన్‌లో గెలుపొందిన వారితో కలెక్టర్ ఎ. శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం టౌన్/రూరల్: జిల్లాలోని ప్రతి ఒక్కరూ ఎయిడ్స్‌పై అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ పిలుపునిచ్చారు. హెచ్ఐవీ/ఎయిడ్స్, మాదక ద్రవ్య దుర్వినియోగంపట్ల యువతలో అవగాహన పెంపొందించేందుకు యూత్‌ఫెస్ట్–2025 ఐఈసీ మారథాన్ 5కె రెడ్‌రన్ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. కలెక్టర్ ఎ. శ్యామ్‌ప్రసాద్, ఎస్‌వీడీ డిగ్రీ కళాశాల వద్ద జెండాను ఊపి రెడ్‌రన్‌ను లాంఛనంగా ప్రారంభించారు. ఈ మేరకు నాలుగురోడ్ల కూడలి మీదుగా రన్ ర్యాలీ కలెక్టరేట్‌కు చేరుకుంది. అనంతరం కలెక్టర్ హెచ్‌ఐవీపై, రక్షణ లేని లైంగిక సంబంధాలు, రక్తమార్పిడి, వాడిన చిరంజీల వినియోగం వంటి తదితర వ్యాప్తి చెందే సందర్భాలపై అవగాహన కల్పించారు. అనంతరం మారథాన్ రెడ్ రన్‌లో మహిళలు, పురుషుల విభాగంలో గెలుపొందిన వారికి బహుమతి ప్రదానం చేశారు. గెలుపొందిన వారిలో మహిళా విభాగంలో పి.అరుణ, ప్రథమ, బి.స్పందన ద్వితీయ స్థానాలను సాధించగా పురుషుల విభాగంలో బి.సాయి ప్రథమ, ఎం.అజయ్‌లు ద్వితీయ స్థానం గెలుచుకున్నారు. అలాగే ట్రాన్స్‌జెండర్ విభాగంలో బి.చిన్ని ప్రథమ, బి.ప్రశాంత్ ద్వితీయ స్థానం గెలుపొందారు. విజేతలకు ప్రథమ బహుమతిగా రూ.10వేలు, ద్వితీయ బహుమతిగా రూ.7వేలు కలెక్టర్ అందించారు. అలాగే క్విజ్ కాంపిటేషన్‌లో ప్రథమ స్థానం విజేతలు మౌనిక, వైష్ణవి, వాసు ద్వితీయ స్థానంలో భువనేశ్వరి, కుమారి తృతీయ స్థానంలో మామిలి, భవ్యశ్రీలకు కూడా కలెక్టర్ బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ నియంత్రణ అధికారి డా.ఎం.వినోద్‌కుమార్, ఏఆర్‌టీ అధికారి డా. ఫణీంద్ర, దిశ సీపీఎం కేవీఆర్. శైలజ, డీఎస్‌డీఓ డా.శ్రీధర్, దిశ టీం జి.అమ్మినాయుడు, జి.కోటేశ్వరరావు, వివిధ కళాశాలల విద్యార్థులు, ఎన్‌జీఓలు, ఎస్ఎస్‌పీ ఫెసిలిటీ స్టాఫ్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి సిమ్స్ బాప్టిస్ట్ చర్చి 150 వసంతాల వేడుకలు

- సంఘమిత్ర డాక్టర్ ఆర్ఎస్.జాన్



సమావేశంలో మాట్లాడుతున్న సంఘమిత్ర

విజయనగరం టౌన్: మత సామరస్యానికి నెలవైన విజయనగరంలో అతిపెద్ద క్రైస్తవ సమాజంగా పేరుపొందిన సిమ్స్ మెమోరియల్ బాప్టిస్ట్ చర్చి 150 వసంతాల వేడుకలను ఈ నెల 10 నుంచి 14వ తేదీ వరకూ నిర్వహిస్తున్నట్లు సిమ్స్ చర్చి సంఘమిత్ర డాక్టర్ ఆర్ఎస్.జాన్ పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం సాయంత్రం సిమ్స్ చర్చిలో కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 150 వసంతాల చారిత్రక నేపథ్యం కలిగిన విజయనగరం సిమ్స్ చర్చి కెనడా మేరీ టైమ్ బాప్టిస్ట్ మహాసభకు చెందిన డాక్టర్ సేన్ ఫోర్డ్ భీమిలి నుంచి ఇక్కడికి వచ్చి 1875 నవంబర్‌లో ఇక్కడ సంఘాన్ని స్థాపించి యాభై ఏళ్ల పాటు క్రైస్తవ ఆధ్యాత్మిక సేవలతో పాటు విద్యాభివృద్ధికి కృషి చేశారని పేర్కొన్నారు. తర్వాత కాలంలో దీనికి సిమ్స్ మెమోరియల్ బాప్టిస్ట్ చర్చిగా నామకరణం చేసినట్లు తెలిపారు. అలా సిమ్స్ స్థాపితమై నేటికి 150 వసంతాలు పూర్తిచేసుకుని, 151 వ వసంతంలోకి అడుగుపెడుతున్నట్లు చెప్పారు. ఈ ఉత్సవాలను విజయనగరం క్రైస్తవ సమాజానికి తలమానికంగా అత్యంత ఘనంగా నిర్వహించ తలపెట్టామని, అందులో భాగంగా బుధవారం ఉదయం 10 గంటలకు కలెక్టర్ డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ ముఖ్య అతిథిగా విచ్చేసి ఈ వేడుకలు ప్రారంభిస్తారన్నారు. ఈ నెల 14వ తేదీ మధ్యాహ్నం ఒంటిగంట వరకూ ఐదు రోజుల పాటు విజయనగరంలో క్రైస్తవ మహాసభలు నిర్వహిస్తామన్నారు. క్రైస్తవమహాసభలకు ప్రముఖ దైవజనులైన రాజమండ్రి జాన్ వెస్లీ, మదనపల్లి రాజశేఖర్, పలమనేరు వేద నాయకం, బెంగుళూరు బెన్నీ ప్రసాద్, తిరుపతి హేమలత ప్రభ, హైదరాబాద్ వద్దే నవీన్ హాజరు కానున్నట్లు తెలిపారు. ఈ వేడుకల్లో సౌత్ ఇండియా యూత్ కన్వెన్షన్ పేరుతో బైబిల్ రిఫరెన్స్, బైబిల్ క్విజ్, గ్రూప్ సింగింగ్ వంటి పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. దైవజనులంతా ఈ కార్యక్రమాల్లో పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

సంగమేశ్వరుడిని దర్శించిన కేరళ స్వామీజీ



సంగమేశ్వర ఆలయం వద్ద రామానందభారతి, తదితరులు

వంగర: మండలంలోని సంగాంలో వెలసిన పవిత్ర సంగమేశ్వరస్వామిని కేరళకు చెందిన రామానందభారతిస్వామి మంగళవారం దర్శించుకున్నారు. ఇటీవల కురిసిన వర్షానికి గర్భగుడిలో చేరిన నీటిని ఇంజిన్ల సాయంతో తోడించారు. అనంతరం స్వామీజీ పూజలు జరిపారు. ఆయన వెంట అరసవెల్లి సూర్యనారాయణ స్వామి దేవస్థానం ప్రధాన అర్చకుడు ఇప్పిలి శంకరశర్మ, ప్రధాన అర్చకుడు సిద్ధాంతం గణపతిశర్మ ఉన్నారు.

ప్రయాణికురాలిపై కేసు నమోదు

భామిని: ఆర్టీసీ బస్సులోని ఓ మహిళా ప్రయాణికురాలిపై కేసు నమోదైంది. దీనిపై బత్తిలి ఎస్సై జి.అప్పారావు మంగళవారం తెలిపిన వివరాల మేరకు భామిని మండలం నేరడి–బి గ్రామానికి చెందిన తాతపుడి లక్ష్మి ఆర్టీసీ కండక్టర్ విధులకు ఆటంకం కలిగించిందనే ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. గురండి సెంటర్ నుంచి శ్రీకాకుళం వెళ్తున్న నిందితురాలు లక్ష్మి కండక్టర్‌కు ఆధార్ కార్డు చూపించే సమయంలో వివాదంతలెత్తింది. దీంతో బస్సులో తన విధులకు ఆటంకం కలిగించిందని ప్రయాణికురాలిపై మహిళా కండక్టర్ ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.

ఇద్దరు మైనర్ల ఫేక్ బాంబ్ కాల్..!

- స్టేషన్‌కు పిలిపించి మందలించిన సీఐ



సీఐ శ్రీనివాసరావు

విజయనగరం క్రైమ్: చదువుకుంటున్న ఇద్దరు మైనర్లు ఫేక్ బాంబ్ కాల్ చేసి అటు స్కూల్ యజమాన్యాన్ని, ఇటు పోలీసులను పరుగులు పెట్టించారు. దీనిపై టుటౌన్ సీఐ శ్రీనివాసరావు తెలిపిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. నెల్లిమర్ల, భోగాపురానికి చెందిన మైనర్‌ల అత్త విజయనగరంలోని డబుల్ కాలనీలో ఉన్న కేజీబీవీలో పనిచేస్తోంది. ఈ మైనర్లు రెండు రోజుల క్రితం ఫంక్షన్‌కు వెళ్లిన సమయంలో తమ అత్త ఇంకా రాలేదన్న అక్కసుతో ఫేక్‌బాంబ్ కాల్ నాటకానికి శ్రీకారం చుట్టారు. సాయంత్రం 5 గంటలకు కేజీబీవీకి ఫోన్ చేసి బాంబ్ ఉందని చెప్పి ఫోన్ కట్ చేశారు. స్కూల్ నుంచి సమాచారం అందుకున్న టుటౌన్ సీఐ తన సిబ్బందితో హుటాహుటిన ఆరోజు రాత్రే కేజీబీవీకి వెళ్లి అణువణువూ గాలించారు. కాగా ఇలాంటి కాల్స్ పట్ల కాస్త అవగాహన ఉన్న సీఐ శ్రీనివాస్ ఒక క్షణం ఆలోచించి ఫోన్ నంబర్లను వెరిఫై చేయగా నెల్లిమర్ల లోకేషన్ చూపించడంతో క్రైమ్ పార్టీతో వెళ్లి ఇద్దరు మైనర్లను పట్టుకుని విచారణ చేయగా అది ఫేక్ కాల్ అని తెలింది. మైనర్ల తండ్రులు ఆర్టీసీలో ఒకరు, సెక్యూరిటీగా మరొకరు పనిచేస్తున్నారు. పోలీసులనే హడలెత్తించిన మైనర్లను సీఐ శ్రీనివాస్ మంగళవారం స్టేషన్‌కు పిలిపించి తల్లిదండ్రుల సమక్షంలోనే సున్నితంగా హెచ్చరించారు. జైలు జీవితం వద్దని, ఇటువంటి ఫేక్ కాల్స్ ఆలోచన రావొద్దని చెబుతూ జీడీలో ఇద్దరి పేర్లను రాయించి ఇంటికి పంపించారు. ఈ విషయమై సీఐ శ్రీనివాస్ మాట్లాడుతూ పిల్లలు ఏం చేస్తున్నారో కన్నవారు నిరంతరం కనిపెడుతూ ఉండాలన్నారు. ఈ ఇద్దరు మైనర్లు ఒకరు అవంతిలో, మరొకరు పాలిటెక్నిక్ చదువుతున్నారు. కాలేజీ స్టూడెంట్స్ భవిష్యత్తు దృష్ట్యా కన్నవారిని పిలిచి మందలించామని సీఐ తెలిపారు.

ఇసుక బండి కింద పడి రైతు మృతి



సన్యాసిరావు మృతదేహం

శృంగవరపుకోట: మండలంలోని వేములాపల్లి గ్రామంలో మంగళవారం ఇసుక బండి కింద పడి ఓ రైతు మృత్యువాత పడ్డాడు. ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. గోస్తనీనదిలోకి ఇసుక కోసం బండి తోలి లోడు వేసుకుని వస్తున్న సమయంలో బొడబల్ల సన్యాసిరావు(48) ప్రమాదవశాత్తు జారిపోయి బండి కింద పడిపోగా టైరు సన్యాసిరావు మీదుగా వెళ్లిపోయింది. దీంతో హుటాహుటిన సహచరులు ఎస్.కోట ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించినట్లు మృతుడి భార్య ఉమ ఎస్.కోట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు ఎస్.కోట పోలీసులు వివరించారు. మృతుడు సన్యాసిరావుకు భార్య ఉమ, పిల్లలు భువనచంద్ర, మౌనికలు ఉన్నారు.

ట్రాక్టర్ కిందపడి వృద్ధుడు..



వల్లయ్య మృతదేహం

శృంగవరపుకోట: పట్టణంలో మంగళవారం మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో వన్‌వే జంక్షన్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధుడు మృతిచెందాడు. ఈ ఘటనపై స్థానికులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. ఇసుక లోడుతో వస్తున్న ట్రాక్టర్ రోడ్డు వారగా నడిచి వెళ్తున్న కొటానవీధికి చెందిన కొటాన వల్లయ్య(74)ను ఢీకొట్టింది. దీంతో ట్రాక్టర్ తొట్టి టైరు కింద పడిన వల్లయ్య అక్కడికక్కడే ప్రాణాలు వదిలాడు. విషయం తెలుసుకున్న ఎస్.కోట పోలీసులు వెంటనే ట్రాక్టర్‌ను స్టేషన్‌కు తరలించి డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. మృతుడి అన్న కొడుకు నారాయణరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు చెప్పారు.

భూగర్భ జలాలు పెంచాలి

- కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

విజయనగరం అర్బన్:

వ్యవసాయానికి నీటి సదుపాయాలను మెరుగు పరచాలని, భూగర్భ జలాల పెంపునకు కృషి చేయాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆదేశించారు. ఈ మేరకు వివిధ ప్రాజెక్టుల ఇంజినీర్లు, ప్రభుత్వ శాఖల అధికారులతో తన చాంబర్‌లో కలెక్టర్ మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, జిల్లాలో ఎక్కువ వ్యవసాయం చిన్నచిన్న చెరువుల పైనే ఆధారపడి ఉందన్నారు. అందువల్ల చెరువుల మరమ్మతులు, అభివృద్ధి చేసి, నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచాల్సిన అవసరం ఉందన్నారు. దీనికోసం చెరువులను సర్వే చేసి, వాటి అభివృద్ధికి సమగ్ర ప్రణాళికలను రూపొందించాలని ఆదేశించారు. రోజుకు కనీసం 100 చొప్పున చెరువులను పరిశీలించి, వారం లోగా 800 చెరువుల అభివృద్ధికి ప్రాజెక్టు రిపోర్టులను సిద్ధం చేయాలని చెప్పారు. అనంతరం ఆర్‌అండ్‌ఆర్ పనులపై కలెక్టర్ సమీక్షించారు. జిల్లా నీటి యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో చెక్‌డ్యామ్‌లు, ఫారం పాండ్స్ నిర్మాణం వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. దీనికోసం త్వరగా అనుమతులు తీసుకుని పనులు మొదలు పెట్టాలని సూచించారు. సమావేశంలో ఇరిగేషన్ ఎస్ఈ ఆర్.అప్పారావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ ఈ ఎస్.కవిత, ఇరిగేషన్ విజయనగరం డివిజన్ ఈఈ ఏవీ రమణ, పార్వతీపురం ఈఈ డీఎస్.ప్రదీప్, డ్వామా పీడీ శారదాదేవి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఐటీ పార్కుల కోసం భూములు గుర్తించాలి

జిల్లాలో ఐటీ పార్కులను ఏర్పాటు చేసేందుకు అవసరమైన భూములను గుర్తించాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆదేశించారు. రెవెన్యూ అధికారులతో తన చాంబర్‌లో మంగళవారం సమావేశం నిర్వహించారు. రాజాపులోవ నుంచి భోగాపురం విమానాశ్రయం వరకు జాతీయ రహదారికి ఇరువైపులా 15 కిలోమీటర్ల పరిధిలో స్థలాలను గుర్తించాలని సూచించారు. ఒక్కో బ్లాకు కనీసం వంద ఎకరాలు ఉండేలా చూడాలన్నారు. ఇలా సుమారు 5000 ఎకరాలను గుర్తించాల్సి ఉందని స్పష్టం చేశారు. ప్రభుత్వ భూములకు ప్రాధాన్యం ఇవ్వాలని, లేని పక్షంలో ప్రైవేట్ భూములను గుర్తించాలని సూచించారు. సమావేశంలో ఇన్‌చార్జి జేసీ ఎస్.శ్రీనివాసమూర్తి, కేఆర్ఆర్‌సీ ఎస్‌డీసీ మురళి, సర్వే ఎ.డి రమణమూర్తి, తహసీల్దార్లు, సర్వేయర్లు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరంఫోర్ట్:

రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా శాఖ బ్లడ్‌బ్యాంక్‌లో టెక్నికల్ సూపర్‌వైజర్లుగా పనిచేయడానికి అర్హులైన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రెడ్‌క్రాస్ సొసైటీ కార్యదర్శి పి.సత్యం ఓ ప్రకటనలో మంగళవారం తెలిపారు. బీఎస్సీ ఎంఎల్‌టీ, డీఎంఎల్‌టీ విద్యార్హత కలిగి, రెండేళ్ల పని అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడుతుందున్నారు. ఎంపికైన వారికి రూ.20 వేల నుంచి రూ.22 వేల వేతనం అందివ్వడం జరుగుతున్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్ 08922-272700, 9493092700లను సంప్రదించాలని ఆయన కోరారు.